క్లుప్తంగా

విద్యుత్ స్తంభానికి మంటలు


విద్యుత్ స్తంభానికి వ్యాపించిన మంటలు

కాళ్ల: మండలంలోని దొడ్డనపూడిలో ఆదివారం రాత్రి విద్యుత్ స్తంభానికి మంటలు వ్యాపించాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పంచాయతీ కార్యాలయ సమీపంలో మంచినీటి చెరువు గట్టు వద్ద ఉన్న విద్యుత్ స్తంభంపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ మొత్తం కాలి బూడిదైపోయింది. ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

అంగన్‌వాడీ పోషణ వాటిక అభినందనీయం


అంగన్‌వాడీ సెంటర్‌లో పెంచిన తోటలను పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి


భీమవరం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రంలో ఆకుకూరలు, కూరగాయలు ఆర్గానిక్ పద్ధతిలో పండించి ఆహారంగా చిన్నారులకు అందించడం అభినందనీయమని ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి ప్రశంసించారు. మండలంలోని రాయలంలో అంగన్‌వాడీ కేంద్రం కోడ్–5 సెంటర్‌ను సోమవారం ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి సందర్శించారు. సెంటర్ ఆవరణలో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్న సెంటర్ టీచర్ మహాలక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో భీమవరం ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీకాంతం, అనిల్‌కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా యాత్ర


జాతీయ జెండాలతో తిరంగా యాత్ర నిర్వహిస్తున్న నాయకులు

ఉండి: శత్రువుల తోకలు కత్తిరించి భారతదేశ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పిన దేశ సైన్యాన్ని చూసి జాతి గర్విస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి అన్నారు. పాకిస్తాన్‌పై జరిగిన యుద్ధంలో పైచేయి సాధించిన కారణంగా సోమవారం ఉండిలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో తిరంగా యాత్రను నిర్వహించారు. ఉండిలోని మహాత్ముడి విగ్రహం వద్ద నుంచి ప్రధాన రహదారుల గుండా తిరంగా యాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి, పేరిచెర్ల సుభాష్‌రాజు, కోరా రామ్మూర్తి, కొమ్మన నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

నాడు ప్రతిపక్షాల గగ్గోలు.. నేడు మహా వృక్షాలు


గతంలో కొమ్మలు తొలగించిన వృక్షాలు

భీమవరం: గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో చెట్లను అక్రమంగా నరికి వేస్తున్నారంటూ గగ్గోలు పెట్టిన ప్రతిపక్ష నాయకులు, ఎల్లోమీడియాకు భీమవరం పట్టణం లూథరన్ హైస్కూలు ఆవరణలో ఈ చెట్లు చెంపపెట్టు. 2023 డిసెంబర్ 29వ తేదీన అప్పటి సీఎం వైఎస్ జగన్ భీమవరంలో ఏర్పాటు చేసిన విద్యా దీవెన కార్యక్రమానికి హాజరు కావడానికి లూథరన్ హైస్కూల్ ఆవరణలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్‌కు చెట్లు అడ్డు వస్తున్నాయని అధికారులు చెట్ల కొమ్మలను తొలగించారు. దీంతో ఇదంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెట్లను తొలగిస్తున్నారంటూ ప్రతిపక్ష టీడీపీ, జనసేన గగ్గోలు పెట్టాయి. తొలగించిన కొమ్మలు తిరిగి చిగురించి నేడు వృక్షాలుగా మారి అనేక మందికి నీడనిస్తున్నాయి. వీటిని చూసిన ప్రజలు నాటి ప్రతిపక్ష నాయకులు స్వలాభం కోసం దుష్ప్రచారం చేశారని విమర్శలు చేస్తున్నారు.

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

భీమవరం(ప్రకాశం చౌక్): పంచారామక్షేత్రం శ్రీఉమా సోమేశ్వర జనార్దనస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన ట్రస్ట్‌కు సోమవారం ఇద్దరు దంపతులు విరాళం అందజేశారు. భీమవరానికి చెందిన నామన విజయ రామమోహన్, సుజానా వెంకటశ్రీదేవి దంపతులు రూ.50,558, మండెల రామాంజనేయులు, బేబి సరోజిని దంపతులు రూ.50,558 విరాళంగా సమర్పించారు. కార్య నిర్వహణాధికారి డి.రామకృష్ణంరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా కాలువ పూడికతీత పనులు

- ఒక చోట గట్టు తీసి మరో పక్క పూడ్చేస్తున్న వైనం
- అయినా పట్టించుకోని అధికారులు


ఓ పక్క మట్టి తీసి మరో పక్క పూడ్చేసిన వాండ్రం కాలువ

ఉండి: ఎవరి ఇష్టారాజ్యం వారిది అన్నట్లుంది ఉండి మండలంలోని అధికారులు, నాయకుల తీరు. కాలువ పూడిక తీత పనులు ఇష్టారాజ్యంగా పగలు, రాత్రి తేడా లేకుండా నిర్వహిస్తున్నారు. చివరికి అధికారులు చెప్పేందుకు సాహసించట్లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తాము చేసిందే పని అని దానికి ఎవరూ అడ్డు చెప్పేది లేదన్నట్లు పనులు నిర్వహిస్తున్నారు. దీనిపై ఎవరి అజమాయిషీ లేకపోవడంతో కాలువల్లో తీసిన మట్టి ఎక్కడిదక్కడే వేసి కాంట్రాక్టర్లు చేతులు దులపుకుని బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు రోజు రోజుకూ కాలువ పూడికతీత పనుల్లో నాణ్యత లోపించడంతో పనులు చేస్తున్న నెపంతోనే మిగిలిన లాంఛనాలు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు సిద్ధమవుతున్నారు.

కాలువ పూడ్చేస్తున్నా పట్టించుకోని అధికారులు

ఎన్నార్పీ అగ్రహారం గ్రామంలో ఉండి కాలువ నుంచి ప్రారంభమైన వాండ్రం పంట కాలువ పూడిక తీత పనులు చేస్తున్నట్లుగా వ్యవహరిస్తూ కొందరు కాలువను పూడ్చేస్తున్నారు. వాండ్రం కాలువ గట్టును ఆనుకొని చాలాకాలం క్రితం నిర్మించిన ప్రహరీ గోడ పడిపోయే స్థితిలోకి రావడంతో ఇప్పుడు దానిని కాపాడుకునేందుకు కాలువ పూడిక తీత పనులను అడ్డం పెట్టుకుని వాండ్రం కాలువ ఒక పక్కగా తవ్వి మరోపక్క (గోడ వైపు) కాలువనే పూడ్చేస్తూ గట్టు నిర్మిస్తున్నారు రైతు సంక్షేమం కోసం వరి పైరుకు పూర్తి స్థాయిలో సాగునీరందించేందుకు ఉండి సబ్ డివిజన్ పరిధిలో రూ.94 లక్షల అంచనాలతో 7 పనులు, గత ప్రభుత్వంలో రూ.12.16 లక్షలతో మొత్తం రూ.1.06 కోట్లతో చేపట్టే పనులు అధ్వానంగా చేస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా కాలువ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఎలాగూ పట్టించుకోని అధికారులు కాలువను పూడ్చేస్తున్నా పట్టించుకోరా అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలు పెడచెవిన

గతంలో కాలువ గట్టును ఆనుకొని ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారు. అయితే ఇటీవల నియోజక వర్గ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఎన్నార్పీ అగ్రహారం పర్యటనలో స్థానికులు ప్రహరీ గోడకు కాలువగట్టు ఆక్రమణ ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. కాలువ గట్టుపై రహదారి నిర్మిస్తే జాతీయ రహదారిని చేరుకుంటామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు దీంతో తహసీల్దార్‌ను ఆ పనులను చూడాలని ఎమ్మెల్యే ఆదేశించినట్లు తెలిసింది. అయితే ఇప్పుడు దానికి వక్రభాష్యం చెబుతూ అధికారులు, స్థానిక ప్రహరీ గోడ యజమాని తవ్వకం పేరుతో కాలువను ఒక పక్క తవ్వి మరో పక్క పూడ్చేస్తున్నారు పూర్తిస్థాయిలో గమనిస్తే కాలువను పూడ్చి ప్రహరీ గోడ వైపు కాలువ గట్టును నిర్మిస్తున్నారు. సర్వే చేయాలని ఎమ్మెల్యే ఆదేశాలను అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హమని ప్రజలు గుసగుసలాడుతున్నారు. పైగా తన సొంత నిధులతో కాలువ తవ్వుతున్నానని యజమాని చెబుతున్నట్లు సమాచారం. ఈ మేరకు చేసిన పనులకు బిల్లులు పెడతారా లేదా అనేది వేచి చూడాలని పలువురు విమర్శిస్తున్నారు.

దళిత విద్యార్థిపై దాడి సిగ్గుచేటు


వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి

ఉండి: తిరుపతిలో దళిత ఇంజనీరింగ్ విద్యార్థి జేమ్స్‌పై దాడి చేయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, న్యాయవాది జి.సుందర్‌కుమార్ పత్రికా ప్రకటనలో సోమవారం తెలిపారు. దళితులకు కూటమి ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. అధికార పార్టీ నాయకుల డైరెక్షన్‌లో కక్షసాధింపు చర్యల్లో మునిగి తేలుతున్న పోలీసు యంత్రాంగం పౌరులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను పూర్తిగా విస్మరించిందన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి బాధితుడు జేమ్స్‌కు న్యాయం చేయాలని పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నట్లు సుందర్‌కుమార్ తెలిపారు.

నిత్యావసరాల ధరలను నియంత్రించాలి


అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం: జిల్లాలో నిత్యావసర సరుకుల ధరలు నియంత్రణలో ఉండేలా తగుచర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో టి.రాహుల్ కుమార్‌రెడ్డి నిత్యావసర సరుకుల ధరల నియంత్రణలో భాగంగా జిల్లాలోని పలు వర్తక సంఘాలు, సివిల్ సప్లై, మార్కెటింగ్ అధికారులతో బియ్యం, పప్పులు, వంట నూనెలు, కూరగాయలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకులు, కూరగాయల ధరల పెరుగుదలను నియంత్రించి డిమాండ్‌కు తగినట్లుగా స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడీ సునీల్ కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్.దేవానంద కుమార్, సీపీఓ కె.శ్రీనివాసరావు, ఏఎస్ఓ ఎం.రవిశంకర్, డీఎస్ఓ ఎన్.సరోజ, రైతు బజార్ ఎస్టేట్ అధికారి పీపీ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు


బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్టు చేసిన సీఐ బలరామరాజు

పాలకోడేరు: మండలంలోని కుముదవల్లి గ్రామానికి చెందిన ఆళ్ల రమేష్ బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడనే సమాచారంతో సోమవారం భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.బలరామరాజు నేతృత్వంలో దాడి చేశారు. ఈ దాడిలో ఆళ్లత రమేష్ వద్ద నుంచి ఏడు ఏడు మద్య సీసాలను స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ బలరామరాజు మాట్లాడుతూ తమ సర్కిల్ పరిధిలో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మినట్లయితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ దాడుల్లో ఆయనతో పాటు ఎస్సైలు ఉమామహేశ్వరరావు, సునీల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

సుందరయ్య పోరాట స్ఫూర్తి కొనసాగించాలి



భీమవరం: సీపీఎం కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న గోపాలన్


భీమవరం అర్బన్: సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు


కాళ్ల: ఉపాధి కూలీలకు మజ్జిగ అందిస్తున్న సీపీఎం నేత రామకృష్ణ

భీమవరం: ప్రజా సమస్యల పరిష్కారానికి పుచ్చలపల్లి సుందరయ్య పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు, ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ పిలుపునిచ్చారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం సీపీఎం ఆఫీసులో పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ముందుగా గోపాలన్ సుందరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు డి.కళ్యాణి, ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరావు, డేగల నాగు తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లికి ఘన నివాళి

కాళ్ల: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం సీపీఎం ఆధ్వర్యంలో కోలనపల్లిలో ఉపాధి కూలీలతో కలిసి సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించి, అనంతరం ఉపాధి కూలీలకు మజ్జిగ అందించారు.కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సుందరయ్య

భీమవరం అర్బన్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమర యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెంప గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎమ్ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుందరయ్య నెల్లూరు జిల్లా అలగానిపాడులో జన్మించారని సాతంత్ర్యోద్యమంలోను, తెలంగాణ రైతాంగా పోరాటంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వేంద్ర అమ్మాజీ, పోతినీడు అప్పారావు, సానబోయినసావిత్రి భవాని,కౌరు వెంకటేశ్వరరావు, ప్రేమ కుమారి, కుక్కల నరసింహమూర్తి,పోతినీడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


బరువానిపేటలో ప్రమాదకరమైన మలుపు వద్ద గోతిలో నిలిచిన వర్షపు నీరు


మలుపులో వర్షపు నీరు లేనప్పుడు కనిపిస్తున్న భారీ గొయ్యి

భీమవరం అర్బన్: మండలంలోని లోసరి పంచాయతీలోని బరువానిపేట మలుపు వద్ద మార్జిన్‌లో ఆర్అండ్‌బీ అధికారులు గ్రావెల్ వేయకపోవడంతో భారీ గొయ్యి ఏర్పడింది. ఇటీవల వర్షం పడటంతో ఆ గొయ్యిలో వర్షపు నీరు నిలిచిపోవడం, ప్రధాన మలుపు కావడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆర్అండ్‌బీ రోడ్డు భీమవరం నుంచి గొల్లవానితిప్ప, గూట్లపాడు, తోకతిప్ప, బరువానిపేట గ్రామాల మీదుగా జాతీయ రహదారి 216లో కలుస్తుంది. రాజధాని దగ్గర మార్గం కావడంతో నిత్యం వందలాది భారీ వాహనాలు, వాహనాలు రాకపోకలతో రద్దీగా ఉంటుంది. గతంలో ఈ మలుపు వద్ద ప్రమాదాలు జరిగి మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. అధికారులు ప్రమాదం జరిగితేనే స్పందిస్తారని లేకుంటే స్పందించరని ప్రయాణికులు, వాహనదారులు బాహాటంగానే చెబుతున్నారు. భారీ వాహనాలు మలుపు వద్ద గొయ్యిలో తరచూ దిగబడిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద మార్జిన్‌లో గొయ్యిలో వర్షపు నీటిని తొలగించి గ్రావెల్ వేసి సమస్యను తొలగించాలని స్థానికులు, వాహనచోదకులు, ప్రయాణికులు, కోరుకుంటున్నారు.

మూతపడ్డ పుస్తక భాండాగారం

- పట్టించుకోని నగర పంచాయతీ అధికారులు
- యథావిధిగా గ్రంథాలయ సెస్సు వసూలు


మూతపడిన స్థానిక నగర పంచాయతీ గ్రంథాలయం

ఆకివీడు: పుస్తక భాండాగారం దుమ్ము, ధూళితో మూత పడింది. పుస్తకం ముసుగేసింది. వందేళ్ల చరిత్ర కలిగిన స్థానిక నగర పంచాయతీ గ్రంథాలయం గత కొన్ని నెలలుగా మూతపడింది. పంచాయతీ గ్రంథాలయాన్ని మార్కెట్ ప్రాంతం నుంచి తరలించి వేరే భవనం ఏర్పాటు చేయాలని పాఠకులు కోరితే, నగర పంచాయతీ అధికారులు మాత్రం మూత వేసి చేతులు దులుపుకున్నారని పాఠకులు వాపోతున్నారు. ఎంతో మంది మహానుభావుల జీవిత చరిత్రల పుస్తకాలు, విలువైన గ్రంథాలయాలు, విజ్ఞానాన్ని అందజేసే గ్రంథాలు, కథల పుస్తకాలు, మహిళలకు ఉపయోపడే నవలలు, విద్యార్థులకు ఉపయోగపడే విజ్ఞాన పుస్తకాలు, సినీ వినోదం, పలు రకాల పేపర్లతో నిత్యం 200 మందికి పైగా పాఠకులతో కళకళలాడే గ్రంథాలయం నేడు మూత పడింది. గ్రంథాలయాన్ని నడిపేందుకు గత వందేళ్ల నుంచి ప్రజల వద్ద లైబ్రరీ సెస్సు పేరుతో కొంత సొమ్మును వసూలు చేస్తున్నారు. ఆ ప్రకారంగా గ్రంథ పాలకుడికి జీతం ఇస్తూ పంచాయతీ గ్రంథాలయాన్ని నడిపించారు. గ్రంథాలయ నిర్వాహకుడు పాపోలు కృష్ణ గాంధీ లైబ్రరీని పకడ్బందీగా నడిపించారు. పుస్తకాలను, పేపర్లను ఎంతో క్రమశిక్షణతో పాఠకులు చదువుకునే విధంగా అందుబాటులో ఉంచారు. తదనంతరం గ్రంథ పాలకులు వీటిని పట్టించుకోలేదు. నగర పంచాయతీ పాలకులు, అధికారులు గ్రంథాలయ అవసరాన్ని పక్కన పెట్టారు. గ్రంథాలయం చుట్టూ ఆక్రమణలకు గురైంది. రణ గొణ ధ్వనుల మధ్య పాఠకులు వెళ్లి చదువుకునేందుకు ఆసక్తి చూపినప్పటికీ నగర పంచాయతీ మాత్రం గ్రంథాలయాన్ని ఎత్తివేసింది. దీనిపై స్థానికులు అనేకసార్లు వినతులు అందజేసినా పట్టించుకునే నాథుడులేడు. స్వాంత్రంత్రోద్యమానికి గ్రంథాలయాల ద్వారానే ప్రజలు చైతన్యవంతులయ్యారన్న విషయాన్ని పాలకులు, అధికారులు గుర్తించాలని పలువురు కోరుతున్నారు. నగర పంచాయతీ గ్రంథాలయాన్ని విన్నూతన రీతిలో పునఃప్రారంభించాలని పాఠకులు కోరుతున్నారు.

రోడ్డు వేయండి సారూ..


కొత్తపూసలమర్రు–లోసరి గ్రామాల మధ్య ధ్వంసమైన గ్రావెల్ రోడ్డు

భీమవరం అర్బన్: మండలంలోని కొత్తపూసలమర్రు–దొంగపిండి గ్రామాల మధ్య బోనకాల దిబ్బ నుంచి లోసరి గ్రామంలోని జాతీయ రహదారి 216కి కలిసే రహదారి ధ్వంసమైంది. జాతీయ రహదారికి దగ్గర మార్గం కావడంతో నిత్యం స్కూల్ బస్సులు, చేపలు లారీలు, మేత లారీలు, ఆటోలు, నిత్యం అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఈ రోడ్డు తరచూ భారీ గోతులు పడిపోవడంతో రైతులు ఎకరానికి కొంత నగదును వేసుకుని గుంతలు పూడ్చుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాలలో కొన్ని చోట్ల వేసిన సీసీ రోడ్డుపైనే రోడ్డు వేస్తున్నారని ఈ రోడ్డును ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు, వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని నూతన రోడ్డును వేయాలని కోరుకుంటున్నారు.

పీజీఆర్ఎస్‌లో ఆరు ఫిర్యాదులు


పీజీఆర్ఎస్‌కు హాజరైన అధికారులు

ఆకివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అధికారులు అధిక సంఖ్యలో గైర్హాజరయ్యారు. పరిష్కార వేదిక నిర్వహించాల్సిన అధికారి కూడా హాజరు కాలేదు. దీంతో అర్జీదారులు నిరాశతో వెనుదిరిగారు. మండలంలోని ప్రధాన శాఖల అధికారులు తహసీల్దార్, వ్యవసాయ సహాయ సంచాలకులు, ఏపీఎం, మరో నాలుగు శాఖల ఉద్యోగులు మాత్రమే హాజరయ్యారు. సోమవారం మండలంలో ఆరు ఫిర్యాదులు అందాయి. కోళ్లపర్రులో రోడ్డు మార్జిన్ ఆక్రమించి, పైప్‌లైన్‌పై గోడ నిర్మిస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన పన్నాసి సత్య శ్రీకృష్ణ ఫిర్యాదు చేశారు. పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదులను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని స్థానిక సాలిపేటకు చెందిన వృద్ధుడు శలాకోట నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. సాలిపేటలోని వినాయక గుడి వెనుక నుంచి ఎల్ఐసీ భవనం వరకూ ఉన్న ఆక్రమణల తొలగింపుపై ఆ ప్రాంత నివాసులు శలా జ్యోతి స్వరూప్‌కుమార్, తాళ్ల వీరన్న ఫిర్యాదు చేశారు. ఇంటి స్థలం మంజూరు చేయాలని పండు అనిల్‌కుమార్, అమృతరావు నగర్‌లోని శ్మశాన వాటికలో సేవల పేరుతో ఆక్రమించిన భూమిపై చర్యలు తీసుకోవాలని శలా భాస్కరరావు ఫిర్యాదు చేశారు.

క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

కాళ్ల: గ్రామ రెవెన్యూ అధికారులను రెండు సచివాలయాలకు కలిపి ఒక క్లస్టర్‌గా నిర్ణయిస్తూ ఒక సచివాలయానికి వీఆర్‌ఓను, మరో సచివాలయానికి సర్వేయర్‌ను కేటాయిస్తూ జారీ చేసిన జీవో నంబర్ 4ను వెంటనే రద్దు చేయాలని వీఆర్వోలు డిమాండ్ చేశారు. సోమవారం కాళ్ల తహసీల్దార్ జి.సుందర్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వీఆర్వోలు మాట్లాడుతూ ఈ క్లస్టర్ విధానం వలన రెండు సచివాలయాలను కలిపి ఒక వీఆర్‌ఓను నియమించటం వలన రీసర్వే, పీఓఎల్ఆర్ రెవెన్యూ సదస్సులు, గ్రామసభలు, పీజీఆర్ఎస్ ఇతర రెవెన్యూ విధులు నిర్వహించడం ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీ కిరణ్, వీఆర్వోలు కెనడి, సీతారాం, శివకుమార్, సుబ్రహ్మణ్యం, హుస్సేన్, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

దేశాలమ్మ జాతర ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చింతలతోటలో కొలువై ఉన్న శ్రీ దేశాలమ్మ 53వ జాతర మహోత్సవాలు సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. జాతరలో కళాకారుల నృత్యాలు నిమిత్తం ప్రధాన రహదారిలో 12 స్టేజిలను ఏర్పాటుచేశారు. జాతరను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామల నుంచి భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు. రాత్రి 1 గంటకు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. మంగళవారం జాతర మహోత్సవాల్లో భాగంగా పట్టణం పురవీధుల్లో గరగల నృత్యాలతో భారీ ఎత్తున ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నూతన కార్యవర్గాల ఎన్నిక

భీమవరం: పట్టణంలోని 26వ వార్డు బ్యాంక్ కాలనీలోని మైత్రీ కాలనీస్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ మహాజన సభ సోమవారం బ్యాంక్ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రంశెట్టి హరనాథ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలో అధ్యక్ష, కార్యదర్శులతో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

భీమవరం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా చైర్మన్ చిలువూరి కృష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గం అధ్యక్ష, కార్యదర్శులుగా బొండా రాంబాబు, అల్లు తులసిప్రసాద్, కోశాధికారిగా కనగర్ల విజయ రామకృష్ణలను ఎన్నుకున్నారు. నూతన కమిటీని క్లబ్ సభ్యులు వబిలిశెట్టి కనకరాజు, వేగిరాజు విశ్వనాథరాజు, నడింపల్లి మహేష్, తదితరులు తదితరులు అభినందించారు.

డీఎన్నార్ పీజీ పరీక్షా ఫలితాలు విడుదల

భీమవరం: డీఎన్నార్ కళాశాల పీజీ కోర్సుల పరీక్షా ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకటనర్సింహరాజు. గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) మాట్లాడుతూ పీజీ కోర్సుల్లో తమ విద్యార్థులు 93 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. నాల్గో సెమిస్టర్ పరీక్షలకు 500 మంది విద్యార్థులు హాజరుకాగా 467 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో ఎంఏ పరీక్షల్లో 95 శాతం, ఎంబీఏలో 95 శాతం, ఎంసీఏలో నూరుశాతం, ఎంకాంలో 93 శాతం ఫలితాలు సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, ప్రిన్సిపల్ జి.మోజెస్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డి.శ్రీనివాసరాజు, వైస్ ప్రిన్సిపల్స్ కె.ఉషారాణి, సీహెచ్‌జే సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వద్దు.. గుడ్డ సంచులే ముద్దు

భీమవరం(ప్రకాశంచౌక్): ప్లాస్టిక్‌ను నిషేధించి గుడ్డ సంచులను వినియోగించడం మనందరి బాధ్యత అని ఆర్టీసీ స్టేషన్ ఆఫీసర్ ఆంజనేయులు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. భీమవరం పాత బస్టాండ్ లో భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ సంచులు వద్దు.. గుడ్డ సంచులే ముద్దు అంటూ అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి 70 గుడ్డ సంచులను ప్రయాణికులకు అందించారు. కార్యక్రమంలో ప్రయాణికులు రుద్రరాజు నాగ రత్నమాల, బాలేపల్లి సరోజినీ, కాటం దుర్గా తదితరులు పాల్గొన్నారు.